

ఆదివాసీల ఆత్మబంధువులు!

ఆదివాసీల జీవితాల్లో హైమన్‌డార్ఫ్ దంపతులు వెలుగులు నింపారు. నేడు మార్లావాయిలో ఆ దంపతుల వర్ధంతి నిర్వహించనున్నారు. 8లో▸



జలంతో తిరుగు పయనం

నాగోబా జాతరకు అవసరమైన గంగాజలం కోసం మెస్రం వంశీయులు కలమడుగులోని గోదావరి నదికి చేరుకున్నారు. జలంతో తిరుగు ప్రయాణమయ్యారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /12.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలి గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెన్నూర్ ఏఎంసీ పాలకవర్గం ఖరారు



మల్లెల దామోదర్‌రెడ్డి



బైంస ప్రభాకర్

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) పాలకవర్గం ఖరారైంది. చైర్మన్‌గా చెన్నూర్‌కు చెందిన మల్లెల దామోదర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా కోటపల్లికి చెందిన బైంస ప్రభాకర్‌లను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఖరారు చేశారు. పాత జీవో ప్రకారం 18మంది డైరెక్టర్లను ఎంపిక చేయాల్సి ఉండగా కసరత్తు సాగుతోంది. త్వరలోనే ఈ పేర్లను ప్రభుత్వానికి పంపించనున్నారు. కాగా, గత చైర్మన్ బత్తుల సమ్మయ్య తొలుత ఏడాదిపాటు పని చేయగా.. ఆరు నెలల చొప్పున మరో ఏడాది పొడగించారు. ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి పదవీ కాలం పూర్తి కాగా ప్రస్తుతం చైర్మన్ రిజర్వేషన్ బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో చైర్మన్‌గా దామోదర్ రెడ్డి, బీసీ సామాజిక వర్గానికి చెందిన బైంస ప్రభాకర్‌ను వైస్ చైర్మన్‌గా ఖరారు చేశారు. కొత్త పాలకవర్గం నెలాఖరులోగా కొలువుదీరనున్నట్లు తెలిసింది.

బీజేపీ లోక్‌సభ ప్రభారీల నియామకం



అల్జాపూర్ శ్రీనివాస్

సాక్షి, ఆదిలాబాద్/మంచిర్యాలటౌన్: బీజేపీ లోక్‌సభ నియోజకవర్గాల ప్రభారీలను నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభ నియోజకవర్గాల కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లనూ నియమించారు. ఆదిలాబాద్ లోక్‌సభ ప్రభారిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన అల్జాపూర్ శ్రీనివాస్, కన్వీనర్‌గా నిర్మల్ జిల్లాకు చెందిన అయ్యన్నగారి భూమన్న, జాయింట్ కన్వీనర్లుగా ఆసిఫాబాద్‌కు చెందిన కోలిపాక కిరణ్‌కుమార్, ఆదిలాబాద్‌కు చెందిన మయూర్‌చంద్రలను నియమించారు. పెద్దపల్లి లోక్‌సభ ప్రభారిగా న్యాయవాది అక్నాపురం విష్ణువర్ధన్‌రెడ్డి, కన్వీనర్‌గా పుదిల్ల మల్లికార్జున్, జాయింట్ కన్వీనర్‌గా ఎస్.వెంకటేష్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు.


'నిరుద్యోగుల ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత'



రఘు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

నెన్నెల: రాష్ట్రంలో నిరుద్యోగుల ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి డిమాండ్ చేశారు. నెన్నెలలో పోలీసు ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న పుపాల్ల రఘు కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల అభ్యర్థులకు యువజన కాంగ్రెస్ అండగా ఉంటుందని అన్నారు. పరుగుపందెంలో ఉత్తీర్ణులై లాంగ్‌జంప్‌లో ఫెయిలైన అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఏడు మార్కులు కలిపి అభ్యర్థులను మెయిన్స్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్, ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు దాగం రమేష్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజన్నయాదవ్, యువజన అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జిల్లాకు రెండోస్థానం



రెండవ స్థానం పొందిన మోడల్ స్కూల్ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో జిల్లాకు చెందిన రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం జరిగిన పోటీల్లో 33 జిల్లాలకు చెందిన వారు పాల్గొనగా, మొదటి స్థానం గుస్సాడీ నృత్యంలో కుమురంభీం జిల్లా, దింసా నృత్యంతో మంచిర్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ఉపాధి గల్లంతు..!



మంచిర్యాల పట్టణంలో ఏసీసీ చౌరస్తా అంటే ఎంతో ఫేమస్. వందలాది మంది ఉద్యోగ, కార్మికులతో నిత్యం సందడిగా ఉండేది. గత నాలుగేళ్లుగా కళ తప్పింది. కంపెనీ మూసివేత దిశగా వెళ్తుండడంతో కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధినిచ్చి, ఇక్కడి అభివృద్ధిలో కీలకమైన ఈ కంపెనీలో ఉత్పత్తి ఆగిపోవడంతో కార్మికులు కుటుంబ పోషణకు నానాకష్టాలు పడుతున్నారు.



ఇదీ మంచిర్యాల పట్టణం రంగపేటలోని శాలివాహన గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ. ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం నిలిచి గత నెల రోజులుగా ఉత్పత్తి ఆగిపోయింది. ఈ కంపెనీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు వందలకు పైగా కార్మికులు, ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారు. మళ్లీ ఉత్పత్తి మొదలైతేనే అందరికీ మేలు జరుగనుంది.

- కంపెనీల మూసివేత
- మొదట ఎంసీసీ, తాజాగా శాలివాహన
- రోడ్డున పడుతున్న కార్మికులు
- ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకోలు



విద్యుత్ కొనుగోలు ఒప్పందం కొనసాగించాలని ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పారిశ్రామికంగా వెలుగొందుతున్న చోటే కార్మికుల జీవితాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. యాజమాన్యాల వైఖరితో వేలాది మంది జీవితాలు ఆగం అవుతున్నాయి. కంపెనీలు మూసివేసే పరిస్థితులతో అనేకమంది ఉపాధి గల్లంతై రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం ఎంసీసీ(ఏసీసీ)తో మొదలై ఇప్పుడు శాలివాహన పవర్‌ప్లాంటుకు చేరింది. ఈ రెండు చోట్ల యాజమాన్యాలు కంపెనీలను తిరిగి నడిపించాలనే చొరవ చూపించడం లేదని కార్మికులు వాపోతున్నారు.

20ఏళ్లకే ఉత్పత్తి నిలిపివేసి..

మంచిర్యాల పట్టణం రంగపేట శివారులో 2002 డిసెంబర్ 6న కర్బన వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా పెద్దపల్లి ప్రాంతానికి చెందిన మల్క కొమురయ్య శాలివాహన గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రారంభించారు. 30ఎకరాల విస్తీర్ణంలో గంటకు ఆరు మెగావాట్ల సామర్థ్యంతో మొదలైన ఈ కంపెనీలో 120మంది శాశ్వత, మరో 100మంది వరకు పరోక్షంగా జీవనాధారం పొందుతున్నారు. వరి, పామాయిల్ పొట్టు, పత్తి వ్యర్థాలు, బొగ్గు, తదితర వాటితో విద్యుత్ ఉత్పత్తి జరిగేది. విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు అమ్మేవారు. ఇందుకోసం 20ఏళ్ల ఒప్పందం పవర్‌పర్చేస్ అగ్రిమెంట్ (పీపీఏ) ఉంది. గత ఏడాది డిసెంబర్‌తో గడువు ముగిసిపోగా మళ్లీ ఒప్పందం జరగలేదు. నెల రోజులుగా ఉత్పత్తి ఆగిపోవడమే కాక, గత సెప్టెంబర్ నుంచి జీతాలు, బోనస్‌లు, అలవెన్స్‌లు రావడం లేదు. యాజమాన్యానికి పలుమార్లు విన్నవిస్తే యూనిట్ ఉత్పత్తి ఖర్చుకు, అమ్మకానికి గిట్టుబాటు కావడం లేదంటూ, ఒప్పందం పునఃరుద్ధరణ చేయకపోవడంతో కార్మికులు ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం యూనిట్‌కు రూ.6చొప్పున చెల్లిస్తుండగా అంతకంటే తక్కువగా చెల్లిస్తామని చెప్పడంతో కంపెనీ భవిష్యత్‌పై నీలినీడలు అలుముకున్నాయి. ఈ కంపెనీ ఏర్పాటు కోసం రైతులు తమకు పని దొరుకుతుందని ఆశతో భూములు ఇచ్చారు. శాశ్వత ఉద్యోగాల పేరుతో పత్రాలు ఇచ్చారు. అయితే 20ఏళ్లకే కంపెనీ మూసివేతకు సిద్ధపడడంతో ఇన్నాళ్లుగా పని చేస్తున్నవారంతా వీధిన పడే పరిస్థితి తలెత్తింది.

దేశంలో పేరొందిన ఏసీసీ

ఉత్తర భారతదేశ పారిశ్రామికవేత్తలు 1936లో అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీ లిమిటెడ్(ఏసీసీ) పేరుతో దేశంలో సిమెంట్ ప్లాంట్లను నెలకొల్పారు. 1956లో మంచిర్యాల పట్టణ శివారులోనూ ఏర్పాటైంది. అపారమైన సున్నపురాయి, భూమి, బొగ్గు, నీరు, కార్మికులు, రోడ్డు, రైల్వే సౌకర్యాలతో ఈ కంపెనీ నడిచింది. సాల్వాయి లొద్ది క్వారీ నుంచి ముడిసరుకు ప్లాంటుకు వచ్చేది. రోజుకు వెయ్యి టన్నులు ఉత్పత్తి చేసే ఈ కంపెనీ, దేశంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, థర్మల్, ఇళ్లు, భవనాల నిర్మాణాల్లో ఈ సిమెంటు కోసం డిమాండ్ ఉండేది. మన్నికైన 43గ్రేడ్ రకం సిమెంట్‌గా పేరొందింది. ఇతర రాష్ట్రాల్లో ప్లాంట్లను అభివృద్ధి చేసి ఇక్కడ పట్టించుకోక యాజమాన్యం విక్రయానికి పెట్టింది. అలా 2006లో మంచిర్యాలలోని కొందరు వ్యాపారులు కొనుగోలు చేసి మంచిర్యాల సిమెంట్ కంపెనీ(ఎంసీసీ)గా మార్చారు. కొంతకాలం నడిపి నష్టాలు వస్తున్నాయని, 2019జూన్ 14నుంచి ఉత్పత్తిని నిలిపివేశారు. జీతాల నిలిపివేతతో అవుట్ సోర్సింగ్ వాళ్లు పని మానేయగా, చివరకు వందమంది మిగిలారు. రూ.కోట్ల కరెంట్ బిల్లులు, బ్యాంకుల్లో రుణాలతో కంపెనీ ఖాయిలా పడింది. కంపెనీ క్వార్టర్లు కలెక్టర్‌తో సహా పలువురికి అద్దెకు ఇచ్చారు. యాజమాన్యం కరెంట్ బిల్లుల మాఫీకి ప్రభుత్వాన్ని కోరింది. కార్మికులు కార్మికశాఖలో ఫిర్యాదు చేయగా ట్రిబ్యునల్‌లో కేసు ఉంది.

భూములు అమ్ముకోవాలనేనా?

ఈ కంపెనీలు ప్రారంభంలో పట్టణానికి దూరంగా ఉండేవి. నలువైపులా పట్టణం విస్తరించడంతో ప్రస్తుతం నడిబొడ్డున ఉన్నాయి. 20ఏళ్ల క్రితం ఎకరం రూ.20 వేల నుంచి రూ.30 వేలు ఉంటే ఇప్పుడు రూ.కోట్లలో చేరింది. కంపెనీని వ్యయ ప్రయాసలకు ఓర్చి నడపడం కంటే మూసివేసి భూములను అమ్ముకుని, రూ.వేల కోట్లు మూటగట్టుకోవచ్చనే ఆలోచనలో ఉన్నాయని కార్మికులు మండిపడుతున్నారు. రెండు చోట్ల కార్మికులు తామంతతామే కంపెనీని వదిలివేసే వరకు చూసి భూములు అమ్ముకునే పరిస్థితి తెస్తున్నారు. ఎంసీసీ కంపెనీ పరిధిలో వందల ఎకరాల భూములు, వేల కోట్లు ఆస్తులు ఉన్నా యి. విద్యుత్ బిల్లులు రూ.9కోట్లు, బ్యాంకుల్లో రూ.40కోట్ల వరకు రుణాలపై నోటీసులు రావడం జప్తు, కరెంట్ సరఫరా నిలిపివేసేలా ఉత్తర్వులు వచ్చాయి. హైటెక్ సిటీ కాలనీ వంద ఎకరాలకు పైగా ఎంసీసీ భూములనే అమ్మి రియల్ వ్యాపారులకు అప్పగించారు. ఇక శాలివాహన కంపెనీ పరిధిలోనూ రంగపేట లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. చుట్టూ కాలనీలు ఏర్పడ్డాయి. కంపెనీ వస్తే తమకు పని దొరుకుతుందనే ఆశతోనే స్థానికులు, ప్రభుత్వం సహకారం చేస్తే, ఇప్పుడు కార్మికుల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులకు పట్టింపేది?


కొత్త కంపెనీలు రావాలి. ఉద్యోగాలు సమకూరాలి. యువతకు ఉపాధి దక్కాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు చేపడుతున్నాయి. అయితే ఏళ్లుగా ఎంతోమందికి ఉపాధిని అందిస్తున్న కంపెనీలు కళ్లముందే మూసివేతకు గురవుతున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ప్రభుత్వం, యాజమాన్యాలకు మధ్యవర్తిత్వం వహించేవారే లేరని వాపోతున్నారు.

పీపీఏను పొడగించాలి



విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ)ను మరో పదేళ్లు పొడగించాలి. ఇన్నాళ్లూ కంపెనీలో పని చేసి, ఇప్పుడు వేరే పనికి వెళ్లలేని స్థితిలో ఉన్నాం. జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. మమ్మల్ని రోడ్డున పడకుండా ఆదుకోవాలి. – కుంటాల శంకర్, స్టాఫ్స్, వర్కర్స్ సంఘం నేత, శాలివాహన గ్రీన్ ఎనర్జీ కంపెనీ

భూములు అమ్ముకునే కుట్ర



ఎంసీసీ యాజమాన్యం మొండిగా ప్రవర్తిస్తోంది. కార్మికుల పొట్టగొట్టి భూములను అమ్ముకుని వేల కోట్లు సంపాదించాలని కుట్ర చేస్తోంది. ప్రభుత్వం వెంటనే ఈ కంపెనీపై కమిటీ వేయాలి. కార్మికులకు న్యాయం చేయాలి.

– గాజుల ముఖేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు, కార్మిక సంఘం, ఏసీసీ

మాడిన అన్నం పెడుతారా..?

- జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్
- ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం
- మూడు రోజుల్లో నివేదికకు ఆదేశం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చెన్నూర్: విద్యార్థులకు మాడిన అన్నం పెడుతారా అంటూ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ చెన్నూర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం మాడిపోవడం, వంటగది అపరిశుభ్రంగా ఉండడం, విద్యార్థులు భోజనం చేస్తుండగా పరిశీలించాల్సిన ఉపాధ్యాయులు తరగతి గదుల్లో కూర్చోవడంపై మండిపడ్డారు. ఆర్‌సీవో గోపినాథ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన మధ్యాహ్నం భోజనం, ఉపాధ్యాయులు, సిబ్బంది తీరుపై మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌లో భూ సమస్యల పరిష్కారం

చెన్నూర్‌రూరల్: ధరణి పోర్టల్ ద్వారా భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కారం అవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన రైతులతో చర్చించారు. ఆర్డీవో వేణు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఆర్‌ఐ స్వప్న, రైతులు పాల్గొన్నారు.

వివాదాస్పదభూమి పరిశీలన

భీమారం: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో క్రీడాప్రాంగణానికి కేటాయించిన భూమి వివాదాస్పద కావడంతో జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్ మంగళవారం సందర్శించారు. వెంటనే భూమి స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఆక్రమణలను తొలగించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సతీష్‌రెడ్డి, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని కిడ్నాప్ కలకలం

నస్పూర్(మంచిర్యాల): నస్పూర్ పట్టణ పరిధిలో ఇంటర్మీడియెట్ సెకండియర్ విద్యార్థిని కిడ్నాప్ వ్యవహారం మంగళవారం కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఓ బాలిక మంచిర్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ప్రతీ రోజు సీసీసీ కార్నర్ వద్ద ఆర్టీసీ బస్‌లో కాలేజీకి వెళ్తుంది. ఈ క్రమంలో ఆమె మంగళవారం కాలేజీకి వెళ్లి తిరిగి సీసీసీ కార్నర్ వద్ద బస్ దిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొందరు వ్యక్తులు ఆమెను ఓ ఆటోలో ఎక్కించుకుని తీసుకెళ్లారు. కాలేజీకి వెళ్లిన విద్యార్థిని సమయానికి ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

దూరపు బంధువే కిడ్నాప్ చేశాడు..?

విద్యార్థినికి దూరపు బంధువైన శంకర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వెంట పడుతున్నట్లు తెలిసింది. ఆ విద్యార్థిని నిరాకరించడంతో శంకర్ పథకం ప్రకారం మాయమాటలు చెప్పి మరికొందరితో కలిసి ఆటోలో తీసుకెళ్లాడు. కంగారు పడ్డ విద్యార్థిని తన స్నేహితురాలికి విషయాన్ని ఫోన్‌లో మెస్సేజ్ చేసింది. ఆ స్నేహితురాలు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక పోలీసులను ఆశ్రయించారు. కాగా విద్యార్థిని కిడ్నాప్ చేసిన వారు కోటపల్లి వద్ద పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం.

యువజన కాంగ్రెస్ నిరసన దీక్ష



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: పోలీస్ ఉద్యోగుల నియామకంలో అవకతవకలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐబీ చౌరస్తాలో నిరసన దీక్ష నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని నిబంధనలు అమల్లోకి తీసుకువచ్చి నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని ఆరోపించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ రన్నింగ్ ఈవెంట్లలో క్వాలిఫై అయిన అభ్యర్థులందరికీ ఉద్యోగాన్ని కల్పించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ అధ్యక్షుడు మహేశ్, పట్టణ అధ్యక్షుడు షేర్ పవన్, నరిగే నరేశ్, అంకతి శ్రీనివాస్, అధికార ప్రతినిధి నాయికిని సురేందర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానేశ్, నస్పూర్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ.. పునర్‌వ్యవస్థీకరణ

- మొదలైన ప్రక్రియ
- నిరంతర పర్యవేక్షణే లక్ష్యం
- కొత్త పోస్టుల సృష్టికి ఆదేశాలు
- మంచిర్యాల కేంద్రంగా మరో 'సర్కిల్'
- ఉమ్మడి జిల్లాలో పలు సబ్‌డివిజన్ ఆఫీసుల పెంపు కూడా



ఆదిలాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: రోడ్లు, భవనాల శాఖలో పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ మొదలైంది. నిరంతర పర్యవేక్షణ, నిర్వహణ చేపట్టే విధంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో వందలాది పోస్టులను ఈ శాఖలో సృష్టిస్తుండగా, మరికొన్ని పోస్టులను రద్దు చేస్తూ ఇటీవలే ప్రభుత్వం నుంచి జీవో జారీ అయింది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించి ఆదిలాబాద్ సర్కిల్‌గా సూపరింటెండింగ్ ఇంజినీర్(ఎస్‌ఈ), నాలుగు జిల్లాలను డివిజన్‌లుగా విభజించి ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్(ఈఈ)ల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. రీఆర్గనైజేషన్‌లో మార్పులు జరగనున్నాయి.

మంచిర్యాల సర్కిల్ కేంద్రం..

ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ డివిజన్‌లు ఉన్నాయి. వీటి కింద ఆదిలాబాద్, ఉట్నూర్, బోథ్, నిర్మల్, భైంసా, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల సబ్ డివిజన్‌లు కొనసాగుతున్నాయి. పునర్ వ్యవస్థీకరణలో మరో సర్కిల్ ఏర్పడనుంది. మంచిర్యాల కేంద్రంగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. తద్వారా బాధ్యతల వికేంద్రీకరణ జరగనుంది. మంచిర్యాల సర్కిల్ కింద మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ సర్కిల్ కింద ఆదిలాబాద్, నిర్మల్ ఉండే అవకాశాలు ఉన్నాయి.


సబ్ డివిజన్‌ల పెంపునకు అవకాశం..

గతేడాది నవంబర్ 17న ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలతో హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల పర్యవేక్షణ, మరమ్మతులు నిరంతరం జరిగే విధంగా శాఖలో వికేంద్రీకరణ జరగాలని అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలని ఆదేశాలిచ్చారు. వానలు, వరదలతో పాడైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. రోడ్లు చెక్కుచెదరకుండా అద్దాల్లా ఉండేందుకు నిరంతరం పర్యవేక్షణ, నిర్వహణ చేపట్టాల్సిన బాధ్యత ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలదేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. డివిజన్ల కింద మరో ఐదు సబ్‌డివిజన్లు పెరగనున్నట్లు తెలుస్తోంది. అలాగే సబ్ డివిజన్ కార్యాలయాల్లో సెక్షన్ల సంఖ్యను మరో 5 నుంచి 8 వరకు పెంచనున్నట్లు సమాచారం.

పీఆర్‌లోనూ..

పంచాయతీరాజ్ శాఖలోనూ పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించింది. అయితే దానిపై ఇంకా కదలిక మొదలు కాలేదు. ప్రస్తుతం ఆదిలాబాద్ కేంద్రంగా పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయం ఉంది. దీనికింద నాలుగు జిల్లాలు డివిజన్‌లుగా, వాటి కింద సుమారు 20 వరకు సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. దీంట్లోనూ ప్రభుత్వం మార్పులు చేర్పులు చేపడుతుందా అనేది ఇప్పటివరకు స్పష్టత రాలేదు.

ఉత్తర్వులు వస్తేనే స్పష్టత



ఆర్‌అండ్‌బీలో పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి తుది ఉత్తర్వులు వస్తేనే మార్పులు చేర్పులు ఎలా ఉంటాయనేది తెలుస్తుంది. అప్పటివరకు ఏమి చెప్పలేం. ప్రధానంగా రోడ్ల నిర్వహణ, మరమ్మతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

– రాజేందర్ నాయక్, ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ, ఆదిలాబాద్

'అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు'



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోళ్లికేరి

వేమనపల్లి: మన ఊరు–మన బడితోపాటు తెలంగాణ క్రీడా ప్రాంగణం, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. మంగళవారం మండలంలోని కల్మలపేట యూపీఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమం, నీల్వాయి, ఎస్టీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించి పనులు పరిశీలించారు. ప్రహరీతోపాటు పాఠశాలలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పల్లెప్రకృతివనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని సర్పంచ్ గాలి మధుకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో విద్యార్థులను కలిసి వారితో మాట్లాడారు. ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, హెచ్‌ఎంలు ప్రసాద్, మహేందర్, శంకర్, టీఏ కృష్ణమోహన్, ఎఫ్ఏ కిషన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఓ వివాహిత మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన వొడ్నాల మౌనిక అనే మహిళ తన భర్త నరేష్ కాపురానికి తీసుకెళ్లడం లేదని మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. భార్యాభర్తల మధ్య కొంతకాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి. భర్త నరేష్‌పై మౌనిక కోర్టులో కేసు వేసింది. కోర్టు వాయిదాలకు సైతం భర్త సరిగా రావడం లేదని తెలుసుకున్న ఆమె మంగళవారం కోర్టు పరిసరాల్లోకి వచ్చి ఆఘాయిత్యానికి యత్నించింది. వెంట తెచ్చుకున్న గడ్డి మందును తాగడానికి సిద్ధపడడంతో స్థానికులు అడ్డుకున్నారు. గడ్డి మందు తాగిందోమోననే అనుమానంతో మౌనికను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు ఆమెను మంచిర్యాలకు పంపించారు. జరిగిన ఘటనపై ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రక్షణ మరువద్దు

- సేఫ్టీ జీఎం గురువయ్య
- ఎస్సార్పీ 1 గని సందర్శన



గని అధికారులతో సేఫ్టీ జీఎం గురువయ్య

శ్రీరాంపూర్: రక్షణను మరువద్దని సేఫ్టీ జీఎం గురువయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఎస్సార్పీ 1 గనిని తనిఖీ చేసి రక్షణ చర్యలను పరిశీలించారు. ఆయనతో పాటు ఏరియా జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ పాల్గొన్నారు. ముందుగా గని మేనేజర్ కార్యాలయంలో రక్షణ చర్యలపై సమీక్షించారు. అనంతరం వారు 3 సీమ్, 3ఎస్11 డిస్ట్రిక్ట్‌లో స్టౌవింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఉద్యోగాలు, అధికారులు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్రొసీజర్స్ అనుసరిస్తూ పని చేయాలన్నారు. రక్షణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా రమేశ్‌బాబు, ఏరియా రక్షణాధికారి గోషిక మల్లేశ్, గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, సేఫ్టీ డీజీఎం రామనాథం, గని మేనేజర్ విజయ్‌కుమార్, రక్షణాధికారి రాజేశ్‌బాబు పాల్గొన్నారు.

17 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా కళాశాలల్లో విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. నేరడిగొండ చైతన్య డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బోథ్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఇచ్చోడ ఛత్రపతి డిగ్రీ కళాశాలలో ఐదుగురు, ఖానాపూర్‌లోని అజ్మీర రేఖశ్యాం డిగ్రీ కళాశాలలో ఒకరు, ఖానాపూర్‌లోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు డిబార్ అయ్యారు.

గుడుంబా పట్టివేత

రెబ్బెన: ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 20లీటర్ల గుడంబాను మంగళవారం రెబ్బెన శివారులో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ సయ్యద్ మోసీన్ వివరాల ప్రకారం... ఎక్సైజ్ పోలీసులు రెబ్బెన శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని దేవులగూడకు చెందిన కజరాల ప్రవీణ్, గోలేటికి చెందిన రాథోడ్ నరేష్ ఇద్దరు యువకులు రెండు బైక్‌లపై 20లీటర్ల గుడంబాను తరలిస్తుండగా పట్టుకున్నారు. గుడంబాతో పాటు బైక్‌లను సీజ్ చేశారు. ఎస్సై నరసింహాచారి, హెడ్ కానిస్టేబుల్ ధర్మప్రకాష్, కానిస్టేబుల్ డి.సురేష్, కమల్, కిరణ్, దిలీప్ ఉన్నారు.

ఆదివాసీల ఆత్మబంధువులు!

- హైమన్‌డార్ఫ్, ఎలిజబెత్ దంపతులు
- నేడు మార్లావాయిలో 36వ వర్ధంతి
- గిరి సంప్రదాయ పద్ధతిలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ సభ్యులు



హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలు



మార్లావాయిలో గ్రామస్తులతో హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు (ఫైల్)

నార్నూర్: అడవుల మధ్య బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఆదివాసీల జీవితాల్లో వారు వెలుగులు నింపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 10వేల కుటుంబాలకు 1.60లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసి వారి గుండెల్లో కొలువయ్యారు. వారంతా నేడు అభివృద్ధి దిశగా పయనిస్తున్నారంటే ఇది ముమ్మాటికీ వారి కృషే. అందుకే నేటికీ అడవిబిడ్డలు ఆ పుణ్యదంపతులను మరువలేకపోతున్నారు. ప్రతీ జనవరి 11న కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లావాయి గ్రామంలో పూర్తిగా గిరిజన సంప్రదాయ పద్ధతిలో వారి వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. విశేష సేవలందించి వారి గుండెల్లో గూడు కట్టుకున్న మానవపరిణామ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

అధ్యయనానికి వచ్చి..

హైమన్‌డార్ఫ్ పూర్తి పేరు క్రిస్టోఫ్‌వోన్ ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్. 1909 జూన్ 22న ఆస్ట్రేలియాలో జన్మించారు. మన దేశంలోని అస్సాం, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లోగల ఆదిమజాతులకు చెందిన కొనాక్, నాగాల జీవన శైలిపై 1930లో అధ్యయనం చేసి మానవ పరిణామ శాస్త్రవేత్త అయ్యారు. నిజాం పాలనలో అడవిలో బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్న ఆదివాసీలు పోడు సాగు కోసం ఆరాట పడుతున్న సమయమది. అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలకు భూములపై హక్కు కల్పించాలని అప్పటి నిజాం ప్రభుత్వం హయాంలో కొమురంభీం తిరగబడ్డారు. ఈ పోరాటంలో భీం నవంబర్ 1, 1940లో వీరమరణం పొందారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసీల తిరుగుబాటు తనానికి గల కారణాలు తెలుసుకునేందుకు అప్పటి నిజాం ప్రభుత్వం మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్‌ను ఇక్కడికి పంపించింది. 1940లో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు ఆదివాసీల ఆచారాలు, సంప్రదాయాలు, జీవన శైలిని పరిశీలించారు. ఇక్కడే వారితో కలిసిపోయి మార్లావాయి గ్రామంలో స్థిరపడ్డారు.

వారు అందించిన సేవలివి..

ఆదివాసీల స్థితిగతులు, వారి అభివృద్ధికి కావాల్సిన సహకారం కోసం డార్ఫ్ అప్పటి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అతడి కృషి ఫలితంగా 1944 నుంచి 1948 వరకు నిజాం హయాంలో 10వేల గిరిజన కుటుంబాలకు రూ.1.60లక్షల ఎకరాల భూపంపిణీ జరిగింది. అంతేకాకుండా డార్ఫ్ సలహా మేరకు 1945లో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకాధికారిని నియమించారు. 1946లో మార్లావాయి, తాడవాయి, కొద్దమెల్ల ప్రాంతాల్లో 30 గిరిజన పాఠశాలలు స్థాపించారు. 1947లో గిరిజన ప్రాంతాలకు దస్తూరి–ఉల్–అమాల్ (1956 పల్లి) జారీ అయింది. దీని ప్రకారం గిరిజనుల హక్కుల పరిరక్షణకు అధికారులను నియమించారు. డార్ఫ్ ప్రోత్సాహంతో తొలిసారిగా ఆదివాసీ తెగ నుంచి తుకారాం ఐఏఎస్ సాధించారు. 1949లో నిజాం ప్రభుత్వం తదుపరి తెలంగాణలో హైదరాబాద్ ప్రభుత్వం వచ్చింది. నిజాం ప్రభుత్వ హయాంలో డార్ఫ్ చేసిన అధ్యయన ప్రతులు ప్రభుత్వానికి అందించారు. దీని మూలంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో గిరిజనుల కోసం ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్ల చట్టాలకు చోటు దక్కింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 నుంచి ఆనాటి 40 గ్రామాలు షెడ్యూల్డ్ ఏజెన్సీగా మారాయి. గిరిజనులకు రక్షణ కల్పించి 1949 నాటి దస్తూర్–ఉల్–అమాల్‌పై రాష్ట్రంలోనూ ఏజెన్సీ ప్రాంతంలో బ్రిటిష్ చట్టం (1915)ను సవరించబడి భూ బదలాయింపు చట్టం 1959లో ఏర్పడింది. తర్వాత 1/70 చట్టం అమలులోకి వచ్చింది.

పరిశోధన రచనలు

హైమన్‌డార్ఫ్ చుంచులు, గోండులు, కోయలపై పరిశోధన రచనలు చేశారు. ఇందులో చుంచుల్, జంగల్ ఫోక్స్ దక్కన్, రాజ్‌గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్, ద గోండ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రెడిషన్ అండ్ ఉల్ యాన్ ఇండియన్ ట్రైబ్.. అనేవి ప్రసిద్ధిగాంచినవి. ఆదివాసీలతో డార్ఫ్ దంపతులకు ఏర్పడిన అనుబంధానికి ప్రతీకగా వారి సంతానానికి లచ్చుపటేల్‌గా నామకరణం చేశారు.

మార్లావాయిలో సమాధులు..

1990లో బెట్టి ఎలిజబెత్ హైదరాబాద్‌లో మృతి చెందగా.. ఆమె కోరిక మేరకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం మార్లావాయి గ్రామంలో సమాధి నిర్మించారు. ఎలిజబెత్ మరణానంతరం డార్ఫ్ ఇంగ్లాండ్‌కు తిరిగివెళ్లారు. అయినప్పటికీ ఆయన తరచూ మార్లావాయిని సందర్శించేవారు. 1995లో జూన్11న ఇంగ్లాండ్‌లో హైమన్‌డార్ఫ్ తుది శ్వాస విడిచారు. డార్ఫ్ దంపతులు ఆదివాసీలకు చేసిన సేవలను నేటికీ అడవిబిడ్డలు మరువలేకపోతున్నారు. ఏటా జనవరి 11న మార్లావాయిలో ఆ పుణ్య దంపతుల వర్ధంతిని పూర్తిగా గిరిజన సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. కాగా, వీరి వర్ధంతిని ప్రభుత్వమే ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీలు కోరుతున్నారు. నేడు వారి 36వ వర్ధంతిని మార్లావాయి గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించనుండగా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ఎంపీ సోయం బాపూరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అధికారికంగా నిర్వహించాలి



హైమన్‌డార్ఫ్ వర్ధంతిని ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలి. ఏటా జనవరి 11న హైమన్‌డార్ఫ్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులే నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి వర్ధంతిని నిర్వహిస్తే ఆదివాసీ సమాజం హర్షం వ్యక్తంజేస్తుంది.

– కనక ప్రతిభ, సర్పంచ్, మార్లావాయి

ఆశయ సాధనకు కృషి చేయాలి



ఆదివాసీ గిరిజనులు అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యంతోపాటు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతులు ఎంతో కృషిచేశారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తాం. వర్ధంతి నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశాం.

– కనక వెంకటేశ్, వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్

ఒకే ఇంట్లో ఇద్దరు సీఏలు



హేమలత, రవళి

మంచిర్యాలక్రైం: సీఏ (చార్టెట్ అకౌంట్స్)లో సామాన్య కుటుంబం నుంచి ఇద్దరు మహిళలు రాణించడంతో పలువురు అభినందిస్తున్నారు. మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బసవ దివాకర్ కోడలు బసవ మున్ని హేమలత మంగళవారం విడుదలైన ఫైనల్ ఇయర్ ఫలితాల్లో 404 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కాగా దివాకర్ కూతురు రవళి 2021లో సీఏ ఫైనల్ పరీక్షల్లో 450 మార్కులు సాధించింది. ప్రస్తుతం రవళి పీడబ్ల్యూసీ కంపెనీ హైదరాబాద్‌లో చార్టెట్ అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. కానిస్టేబుల్ కూతురు, కోడలు ఇద్దరు సీఏలుగా ఉత్తీర్ణత సాధించడాన్ని స్థానిక పోలీస్ అధికారులు డీసీపీ అఖిల్‌మహాజన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ నారాయణనాయక్ అభినందించారు.

'చరిత్రాత్మక ఒప్పందం చేశాం'



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: ఈ సారి 11వ వేజ్‌బోర్డులో చరిత్రాత్మక ఒప్పందం చేశామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. ఇటీవల ఏ పరిశ్రమల్లో కూడా 10 శాతం నుంచి 15 శాతం మించి వేతనాలు పెరుగలేదని, బొగ్గు పరిశ్రమల్లోనే తాము కొట్లాడి 19 శాతం వేతనాలు పెంపుదల చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు చిలుక రాంచందర్, దాసరి రాజేశం, కారుకూరి నగేశ్, వై సంపత్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

- రూ.8లక్షలా 57వేలు ఆస్తినష్టం
- స్పందించని ఫైర్ సిబ్బంది



కిరాణాషాపు నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కోటపల్లి: విద్యుదాఘాతంతో ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో కుటుంబం రోడ్డున పడిన విషాద సంఘటన మండలంలోని ఎదులబంధం గ్రామంలో చోటుచేసుకుంది. ఎదులబంధం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ధనుంజయ్ ఇంట్లో సిర్సా గ్రామానికి చెందిన గోడిసెల శంకరక్క అనే మహిళ కిరాణ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తుంది. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు షాపుకు తాళం వేసి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో షాపులో నుంచి పొగలు, శబ్దం రావడంతో షాప్ పక్క ఇంట్లో ఉంటున్న వీఆర్ఏ ధనుంజయ్ గమనించి శంకరక్కకు సమాచారం అందించాడు. ఎంపీటీసీ శేఖర్ స్థానికులతో కలిసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. షాపులో పెట్రోల్, ఆయిల్ లాంటివి ఉండటంతో మంటలు తగ్గకపోవడంతో కొద్ది సమయంలోనే ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. సుమారు గంటపాటు ప్రయత్నించి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకట్, ఆర్ఐ జశ్వంత్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో రూ.8లక్షల 57వేల ఆస్తినష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా సంఘటన స్థలానికి చేరేందుకు 2గంటల సమయం పడుతుందని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత...

వీఆర్ఏ ధనుంజయ్ ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కాలిబూడిద కాగా జెడ్పీ కో–ఆప్షన్ అజ్గర్ సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణ సహాయం కింద రూ.5వేల నగదును బాధితులకు అందజేశారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

రెబ్బెన(ఆసిఫాబాద్): ఇటీవల నిర్వహించిన పోలీస్ రిక్రూట్‌మెంట్ ఫిజికల్ ఈవెంట్స్‌లో క్వాలీఫై అయిన అభ్యర్థులకు సింగరేణి ఆధ్వర్యంలో మెయిన్స్‌కు ఉచితంగా శిక్షణ అందజేస్తామని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. మంగళవారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరంలో 87 మంది అభ్యర్థులకు శిక్షణ అందించగా 59 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. కానిస్టేబుల్ అభ్యర్థులు 47మంది కాగా ఎస్సై అభ్యర్థులు 12మంది అర్హత సాధించటం సంతోషకరమన్నారు. ఈవెంట్స్‌లో క్వాలీఫై అయిన అభ్యర్థులందరికీ మెయిన్స్ రాత పరీక్ష కోసం ఉచితంగా శిక్షణ అందజేస్తామని ప్రకటించారు. అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాలన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: సింగరేణి భూముల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ప్రజలకు భూములు క్రమబద్ధీకరించి యాజమాన్య హక్కు కల్పించడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీవో నం.76లో భాగంగా అందిన దరఖాస్తులపై పారదర్శకంగా సర్వే నిర్వహించి నివేదిక అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వేణు, శ్యామలాదేవి, ఎస్ఎల్ఆర్ ఏడీ శ్రీనివాస్‌తో కలిసి సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జీవో నంబర్ 76 కింద భూమి అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి కొలతల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

బెల్లంపల్లిలో రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఫిబ్రవరి చివరి వారంలో రాష్ట్ర స్థాయి హాకీ ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సింగరేణి లెజెండ్స్ హాకీ పోటీల నిర్వహణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, సీబీసీఐడీ రిటైర్డు అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. బెల్లంపల్లిలోని సింగరేణి తిలక్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో 30 టీములు పాల్గొంటాయని తెలిపారు. హాకీ పోటీల్లో పాల్గొనదలచిన వారు రూ.2500 చెల్లించాలని, పూర్తి వివరాలకు 7702913247, 9849248686 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ కార్యదర్శి ఎండీ.అజ్గర్ పాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జాఫర్, దిలీప్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

గోదావరి జలంతో తిరుగు పయనం



తిరుగు పయనమైన మెస్రం వంశీయులు

- పుణ్యస్నానాలాచరించి, రాగిపాత్రలో నీటిని నింపి
- కేస్లాపూర్‌కు బయలుదేరిన మెస్రం వంశీయులు



గంగజలం నింపిన రాగిచెంబుకు పూజలు చేస్తున్న మెస్రం పెద్దలు

జన్నారం: కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా మహాపూజకు కావాల్సిన గంగాజలం కోసం మెస్రం వంశీయులు మండలంలోని కలమడుగు గోదావరికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి వంటలు చేసుకుని భోజనాలు చేశారు. గోదావరి తీరంలోని హస్తల మడుగులో ప్రత్యేకమైన రాగి చెంబులో నీటిని నింపారు. అనంతరం చెంబును కర్రకు కట్టుకుని సంప్రదాయ తెల్లని దుస్తులతో తిరుగు పయనమయ్యారు. ఈ నెల 2న కేస్లాపూర్ నుంచి బయలుదేరిన మెస్రం వంశీయులు కాలినడకన మంగళవారం చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఉట్నూర్, దొడందాలో బస చేసి, విశ్రాంతి తీసుకున్న అనంతరం 17న ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకుని పూజలు చేయనున్నట్లు మెస్రం వంశ పెద్దలు ప్రదాన్ మెస్రం దాదరావు, కటోడా మెస్రం కోసు, హన్మంతరావు, మెస్రం ఉద్యోగుల సంఘం నాయకులు మెస్రం మనోహర్, మెస్రం దేవరావు, మెస్రం శేఖు, తుకారాం నాగనాథ్ తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయాలి

- రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి
- ఉట్నూర్‌లో సైన్స్‌ఫేర్ ప్రారంభం



సైన్స్‌ఫేర్‌ను తిలకిస్తున్న మంత్రి ఐకే రెడ్డి

ఉట్నూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభతోపాటు సృజనాత్మకత వెలికితీయాలని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సైన్స్ ఫేర్‌ను ఆయన ఎమ్మెల్యే రేఖానాయక్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల్లో ప్రతిభకు కొదువలేదన్నారు. వారిని ప్రోత్సహిస్తే ఎన్నో ఆవిష్కరణల ద్వారా ఉన్నత స్థానాలకు చేరుతారని చెప్పారు. ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ నిర్వహించామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 133 ఆశ్రమ పాఠశాలలుండగా, ఎనిమిది డివిజన్ల నుంచి 12 మంది విద్యార్థుల చొప్పున 96 మంది వివిధ ఆవిష్కరణలు చేశారని తెలిపారు. మాజీ ఎంపీ గోడం నగేశ్, ఆదిమ గిరిజన సలహా మండలి అధ్యక్షుడు కనక లక్కేరావ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాంనాయక్, పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలు గాలికి వదిలేసిన టీబీజీకేఎస్'



సమస్యలను వివరిస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన టీబీజీకేఎస్ నాయకత్వం కార్మిక సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందని హెచ్ఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఓజియార్, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి వైద్యాధికారి స్టాలిన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల ఆరోగ్యాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, ఒక్క సింగరేణి ఆసుపత్రిని కూడా ఆధునీకరించడం లేదన్నారు. గోలేటి డిస్పెన్సరీలో రోగుల కోసం మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఆస్పత్రి ఇన్‌చార్జి శ్రీనివాస్, వర్క్ షాప్ ఫిట్ కార్యదర్శి వశీం, కైరిగూడ ఇన్‌చార్జి సంపత్, నాయకులు ఖాదర్ పాల్గొన్నారు.

ఓసీపీలో బొగ్గు ఉత్పత్తిపై డైరెక్టర్ సమీక్ష

శ్రీరాంపూర్: ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తిపై కంపెనీ డైరెక్టర్(పీపీ, ఫైనాన్స్) యన్.బలరాం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. శ్రీరాంపూర్ నుంచి ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి పాల్గొని శ్రీరాంపూర్ ఏరియా ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, సాధించిన ఉత్పత్తి, బొగ్గు రవాణాపై చర్చించారు. ఓబీ కూడా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం తీయాలని డైరెక్టర్ సూచించారు. ఓసీపీ పీవోలు వి.పురుషోత్తంరెడ్డి (శ్రీరాంపూర్ ఓసీపీ), ఎం.శ్రీనివాస్ (ఇందారం ఓసీపీ), డీ జీఎం చిరంజీవులు, ఐటీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

విధి నిర్వహణలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న అఖిల్ మహాజన్

మంచిర్యాలక్రైం: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుళ్లు విధి నిర్వహణలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, తమ ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలని రామగుండం పోలీసు కమిషనరేట్ డీసీపీ(అడ్మిన్) అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్‌లోని హెడ్‌క్వార్టర్స్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని ఏఆర్ పోలీసుల సమీకరణ కవాతు, డ్రిల్, లాఠీ డ్రిల్, బందోబస్తు, లా అండ్ ఆర్డర్, వెపన్ శిక్షణ తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు రెండు వారాలపాటు కొనసాగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ ఏఆర్ రామగుండం సుందర్‌రావ్, ఆర్ఐలు మధూకర్, శ్రీధర్, విష్ణుప్రసాద్, ఆర్ఎస్సైలు రాజేష్, ప్రవీణ్ అనిల్, విశ్వజా, శ్రావణి, అమీదాబేగం ఉన్నారు.

కేకే ఓసీలో డ్రైవర్ల సమ్మె

- ఆర్‌వీఆర్ కంపెనీ తీరుపై డ్రైవర్ల ఆగ్రహం



సమ్మెకు దిగిన కేకే ఓసీ డ్రైవర్లు

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓసీలో ఆర్‌వీఆర్ సంస్థ సూపర్‌వైజర్ తీరును నిరసిస్తూ డ్రైవర్లు సోమవారం రాత్రి షిఫ్ట్ నుంచి సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ సంస్థ మేనేజర్ పోగుల్‌రెడ్డి డ్రైవర్లు, కాంట్రాక్ట్ కార్మికులపై దురుసుగా ప్రవరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నియంతలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతడిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెతో మంగళవారం మొదటి షిఫ్ట్‌లో పూర్తిస్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్ వచ్చి డ్రైవర్లతో పాటు సంస్థ సూపర్‌వైజర్లతో మాట్లాడి సమస్య పరిష్కరించడంతో నాలుగు గంటల నుంచి సెకండ్‌షిఫ్ట్‌లో డ్రైవర్లు విధులకు హాజరయ్యారు. సమ్మె చేస్తున్న డ్రైవర్లకు మండల బీజేపీ నాయకులు సూరం కిరణ్‌కుమార్, నరేష్, రమేషులు మద్దతు తెలిపారు.